## క్లుప్తంగా

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



**పిట్టువారిపాలెం(కర్లపాలెం):** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లలు దగ్ధమైన సంఘటన పిట్టలవానిపాలెం మండల పరిధిలోని పిట్టువారిపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామ రెవెన్యూ అధికారి గోవర్ధని తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఏత్ర శివనాగిరెడ్డి ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఎగసి పడ్డాయి. దీంతో రెండు ఇళ్లలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారుగా రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు వీఆర్వో తెలిపారు. చందోలు ఎస్‌ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ దగ్ధమైన ఇళ్లను సందర్శించి బాధితులను పరామర్శించారు.

### ఖాతాదారులు, బ్యాంక్ భద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలి

**నిజాంపట్నం:** బ్యాంక్ ఖాతాదారుల సౌకర్యం, బ్యాంక్ భద్రతలపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని నిజాంపట్నం ఎస్‌ఐ కందుల తిరుపతిరావు తెలిపారు. మండల కేంద్రమైన నిజాంపట్నం పోలీసు స్టేషన్‌లో మండలంలోని వివిధ బ్యాంకుల ప్రతినిధులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. అదే విధంగా నిజాంపట్నంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్.. బ్యాడ్‌టచ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించి ఎస్‌ఐ తిరుపతిరావు పలు సూచనలు చేశారు.

### కృష్ణా తీరంలో కోడి పందేల జోరు!



**కొల్లూరు:** పందెపు కోళ్ల కూతలతో కృష్ణా తీరం మార్మోగుతోంది. కూటమి శ్రేణులు బరితెగించి బాహాటంగా కోడి పందేలు నిర్వహిస్తున్నా అడ్డుకోవాల్సిన పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. కోడి పందేలతో పాటు పలు గ్రామాలలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట జరుగుతున్నట్లు సమాచారం. మండలంలోని సుగ్గునలంక పరిసరాలతో పాటు, బాపట్ల, గుంటూరు, కృష్ణా జిల్లాల సరిహద్దుల్లో నిరంతరం జోరుగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. సుగ్గునలంకతో పాటు పలు లంక గ్రామాలు, కొల్లూరు, ఈపూరు, చిలుమూరు పరిసర గ్రామాలలో సైతం పందేల నిర్వహణ రూ.లక్షల్లో జరుగుతుందని సమాచారం. బుధవారం సుగ్గునలంక పరిసరాలలో జరిగిన కోడి పందేల నిర్వహణ సైతం వివాదాస్పదమయ్యింది.

### రైతు ఉత్పత్తిదారుల సంఘం సందర్శన



**తెనాలి:** రాష్ట్రంలోని సహకార సొసైటీల సీఈవోలు బుధవారం మండల కేంద్రమైన కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించారు. సమగ్ర పోషణ యాజమాన్యంపై శిక్షణలో భాగంగా వచ్చిన సీఈవోలు అక్కడి, సేంద్రియ వ్యవసాయం, ఉత్పత్తుల తయారీ, సోలార్ డ్రయర్, ప్రాసెసింగ్ సెంటర్ పనితీరును పరిశీలించారు. సంఘం పనితీరును, అక్కడి కార్యకలాపాలను 'శ్రేష్ట' డైరెక్టర్ వుయ్యూరు సాంబిరెడ్డి వివరించారు. వివిధ వ్యవసాయ పంటల్లో సమగ్ర పోషణ యాజమాన్యంపై ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత 15 రోజులుగా శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. 'మేనేజ్', 'సమితి' సంస్థల సహకారంతో జరుగుతున్న శిక్షణలో భాగంగా శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించినట్లు గుంటూరు ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.వెంకటరాములు వెల్లడించారు. అలాగే విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థినులతోనూ సీఈవోలు మాట్లాడారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బొంతు గోపాలరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# గుంతల రోడ్లు.. ప్రయాణానికి పాట్లు!

- కనీస మరమ్మతులకు నోచుకోని రహదారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- మత్తు నిద్రలో కూటమి ప్రభుత్వం



అమర్తలూరు, గోవాడ మార్గంలో గుంతలో ఇరుక్కుపోయిన ఆర్టీసీ బస్సు

**వేమూరు:** నియోజకవర్గంలోని రహదారులు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. రోడ్లపై గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోనికి వచ్చిన ఆరు నెలల్లో రోడ్లను మరమ్మతులు చేస్తామని ఆర్భాటంగా ప్రచారాలను నిర్వహించింది. తీరా అధికారం చేపట్టి ఏడాది దాటినా కూడా కనీస మరమ్మతులు చేపట్టకుండా కాలయాపన చేస్తోంది. రోడ్లపై గుంతలు అధికమవుతున్నా కూటమి ప్రభుత్వం మత్తు నిద్రలో ఉందని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. అమర్తలూరు మండలంలో తెనాలి నుంచి చెరుకుపల్లి వెళ్లే ఆర్‌అండ్ బీ రహదారిలో అమర్తలూరు, గోవాడ మధ్య ఇటీవలే ఓ ఆర్టీసీ బస్సు గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో బస్సు వెనుక వైపు యాక్సిల్ విరిగిపోయి బస్సు టైరు బయటకు వచ్చింది. ప్రయాణికులు చేసేదేమీ లేక వేరే బస్సులో తమ గమ్యస్థానాలకు చేరుకున్నారు.

**చుండూరు మండలంపై వివక్షత..**

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చుండూరు మండలంపై వివక్షత చూపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చుండూరు మండలంలోని అన్ని లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నా ఇంతవరకూ లింక్ రోడ్ల గురించి ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. 2015 నుంచి 2019 వరకూ ఆయన ఎమ్మెల్యే, మంత్రిగానూ పని చేసినా మండలంలోని రహదారల పరిస్థితి నేటికీ దయనీయంగా ఉండడం గమనార్హం అంటూ వాపోతున్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది అయినా రోడ్ల బాగు గురించి ఆయన పట్టించుకోవడం లేదంటున్నారు. కూటమి ప్రభుత్వం రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

### విద్యార్థులకు నడకయాతన..

వేమూరు నియోజకవర్గంలోని చుండూరు, అమర్తలూరు, భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లో రోడ్లపై గుంతలు తటాకాలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చుండూరు మండలంలోని కారుమూరుపాలెం నుంచి మండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నడకయాతన పడుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో గుంతల రహదారిలో నడవడానికి సైతం పాట్లు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్యపై కూటమి ప్రభుత్వం స్పందించి త్వరితగతిన రహదారులను బాగు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



కారుమూరిపాలెం నుంచి గుంతల రోడ్డులో వెళుతున్న విద్యార్థులు

**చాలా ఇబ్బందులు పడుతున్నాం..**



చుండూరు మండలంలోని లింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లో రోడ్లు వేస్తామన్నారు. ఇంత వరకూ వేయలేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– తమ్మా పాముల రెడ్డి, చినపరిమి గ్రామం, చుండూరు మండలం

**త్వరగా రోడ్లు వేయాలి..**



రోడ్లపై గుంతల వల్ల ఆర్టీసీ బస్సు యాక్సిల్ విరిగిపోయింది. ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పిల్లలు బడికి వెళ్లాలన్నా కష్టంగా ఉంది. కూటమి ప్రభుత్వం త్వరగా రోడ్లు వేయాలి.

– పోతర్లంక సురేష్, అమర్తలూరు మండలం

## జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవడంలో తీవ్ర జాప్యం




ముత్తాయ్యపాలెం గ్రామంలో మాట్లాడుతున్న కోన రఘుపతి

**బాపట్ల టౌన్:** బాపట్ల జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేసుకోవడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర జాప్యం చూపుతోందని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముత్తాయ్యపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. బాపట్ల జిల్లా కేంద్రానికి అనుగుణంగా రోడ్లు విస్తర్ణ చేపట్టడంతో పాటు జిల్లా కేంద్రాన్ని బాపట్లలోనే తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. విద్య కేంద్రమైన బాపట్లను వైద్యరంగంలో కూడా ముందు వరసలో ఉంచాలనే తలంపుతో ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాలను తీసుకువచ్చామన్నారు. మెడికల్ కళాశాలను నిర్మిస్తే వైఎస్సార్‌సీపీకి పేరొస్తోందని వాటిని కూటమి ప్రభుత్వం మూలన పెట్టిందని తెలిపారు. ఇప్పటికైనా అభివృద్ధిలో ముందువరసలో జిల్లాను ఉంచాలని ఆయన సూచించారు.

**హామీలు ఎక్కడ చంద్రబాబు..**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వెనుకంజలో ఉందని కోన తెలిపారు. సచివాలయాల వ్యవస్థతో గ్రామీణ ప్రాంతాలాభివృద్ధికి కృషి చేస్తే ఇప్పుడు వాటిని కూడా నీర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు మరుప్రోలు ఏడుకొండలరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు చేజర్ల నారాయణరెడ్డి, నక్కా వీరారెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు, వడ్డిముక్కల డేవిడ్, నాయకులు తాతా గుడారంకయ్య, అంకిరేకుల సోమయ్య, సుబ్బారావు, వల్లు గంగాధర్, పీటా వేణుగోపాల్, వల్లు పార్వతి, మచ్చా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేటి జలదీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్‌బాబు**

**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో రైతుల కోసం గురువారం నిర్వహిస్తున్న జలదీక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు కోరారు. అశోక్‌బాబు మాట్లాడుతూ.. భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి జగనన్న కాలనీ నుంచి ప్రారంభమైన కనగాల అప్లాండ్ కాలువ గంగోలు డ్రైయిన్‌లో తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులను కోరుతూ రైతుల కోసం జలదీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అద్దేపల్లిలోని కనగాల అప్లాండ్ కాలువ, గంగోలు కాలువను ఆయన పరిశీలించారు. అశోక్‌బాబు చేపడుతున్న జలదీక్ష కార్యక్రమంలో ప్రతి రైతు పాల్గొని భాగస్వామ్యం కావాలని వేమూరు నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు గోపాలం కోరారు.



అద్దేపల్లి కనగాల అప్లాండ్ కాలువను పరిశీలిస్తున్న అశోక్‌బాబు

**చుండూరు(వేమూరు):** నియోజకవర్గం సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు జలదీక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నారని నియోజకవర్గం వైఎస్సార్ సీపీ రైతు విభాగం కార్యదర్శి గాదె శివరామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## లంక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**భట్టిప్రోలు:** నాగార్జున సాగర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి ఆధ్వర్యంలో కృష్ణా నది పరివాహక లంక గ్రామాలైన భట్టిప్రోలు మండలం వెల్లటూరు, ఓలేరు పల్లెపాలెం కాలువ కట్టలను బుధవారం ఆమె పరిశీలించారు. ఆర్డీవో రామలక్ష్మి మాట్లాడుతూ.. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. వరద నీటిలో ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం లాంటివి చేయవద్దని తెలిపారు. జంతువులను నదిలో వదిలేయొద్దని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. అనంతరం కాలువ కరకట్ట వద్ద కోతకు గురవుతున్న ప్రదేశాన్ని వారు పరిశీలించారు. వెంట తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, వీఆర్వోలు మండ్రు జక్రయ్య, లంకె సురేష్, కాశీకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామ సర్పంచులు, రెవిన్యూ సిబ్బంది వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

**కొల్లూరు:** కృష్ణా నదికి ప్రకాశం బ్యారేజ్ నుంచి వరద నీటిని వదులుతుండడంతో తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడం తక్షణ కర్తవ్యంగా భావించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. బుధవారం ఆమె మండలంలోని పెసర్లంక, గాజుల్లంక, ఈపూరు, కోటిపల్లి ప్రాంతాలలో పర్యటించి వరద సహాయక చర్యలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆర్‌సీ ఏఈ విజయ్‌రాజును తక్షణం కరకట్టలకు ఏర్పడిన గండిల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌వో బి.వెంకటేశ్వర్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి

## రైతులు సాగు వివరాలను ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలి



మోర్లవారిపాలెంలో మాట్లాడుతున్న మహేష్‌బాబు



బలిజేపల్లి కార్యక్రమంలో పాల్గొన్న ఉషా

**రేపల్లె:** రైతులు తాము సాగు చేసే పంట వివరాలను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అవ్వారు మహేష్‌బాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్లవారిపాలెం గ్రామంలో బుధవారం రైతులతో కలిసి సాగు భూమిని ఆయన పరిశీలించారు. రైతు సేవా కేంద్రం ఆవరణలో ఇప్పటికే అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా, ఎన్‌పీసీఐ లింక్ జాబితాలను ఏర్పాటు చేశామని.. రైతులు తమ వివరాలను పరిశీలించుకోవాలని అన్నారు. ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

**వేమూరు:** వరి పంటకు రైతులు ఎరువులను తగిన మోతాదులో వాడాలని డాట్ కేంద్రం శాస్త్రవేత్త ఎం.ఉషా తెలిపారు. వేమూరు మండలంలోని వరహాపురం, బలిజేపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రేమసాగర్ మాట్లాడుతూ.. వెద పద్ధతి సాగు చేసిన 15 నుంచి 20 రోజుల దశలో నామిని గోల్డ్ ఎకరానికి 100 మి.లీ. చొప్పున పిచికారీ చేయాలన్నారు. దీంతో అన్ని రకాల కలుపు మొక్కల నియంత్రణ జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

**అమర్తలూరు(వేమూరు):** అమర్తలూరు మండలంలోని ప్యాపర్రు, బోడపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి సరళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భారత్‌కుమార్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజనలో 2025 ఈ-పంట నమోదు మొదలైయ్యిందని, పంట సాగు చేస్తున్న ప్రతి రైతు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అచ్చన వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు బి.మణికంఠ, వ్యవసాయ సహాయకులు ఎ.శ్రీమణి, పూజ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్యాపర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న సరళ

## టీ10 టెన్నిస్ క్రికెట్ బాల్ జిల్లా జట్టుకు ఎంపిక

**బాపట్ల:** టీ10 టెన్నిస్ క్రికెట్ బాల్ జిల్లా జట్టుకు బాపట్ల ప్రోడిజి విద్యాలయ్ విద్యార్థులు ఎంపికయ్యారని టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా కార్యదర్శి బత్తుల వీరశేఖర్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. బాపట్ల సూర్యలంక రోడ్ లోని ప్రోడిజీ విద్యాలయ్‌లో జిల్లా జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించగా ప్రోడిజి విద్యాలయ్ ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్ గో క్రీడాకారుల ఆటను ప్రారంభించారని వీరశేఖర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ప్రోడిజి విద్యాలయ్ సంస్థల చైర్మన్ మాచాబత్తిని శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ బ్రజేష్ కానూన్ గో అభినందించారు. ఎంపికైన జిల్లా జట్టు, ఆగస్టు 3, 4వ తేదీలలో అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి పలువురు పీఈటీలు పాల్గొన్నారు.

## బాబు పాలనలో మోసం గ్యారెంటీ



జంపని కార్యక్రమంలో పాల్గొన్న సుబ్బారావు

**వేమూరు:** నిరుద్యోగ భృతి ఎక్కడని వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు దాది సుబ్బారావు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వేమూరు మండలంలోని జంపని గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు షేక్ బుజ్జి, జంపని పురుషోత్తం, తాడి శెట్టి నరసింహారావు, పఠాన్ అలీఖాన్, బొడుగు వెంకటేశ్వర్లు, జంగం సుధాకర్, జొప్పర సుధాకర్, జంపని బుల్లిరాజు, తటుకూర్తి నాగరాజు, వేల్పూల నారాయ్య, కారుమంచి కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వేమూరు మండలంలోని వెల్లబాడు గ్రామంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో సుబ్బారావు పాల్గొని కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు వెల్లబాడు బుల్లియ్య గ్రామ పార్టీ అధ్యక్షులు నంది పాగ వందనం, బండి ఏసుబాబు, అద్దెపల్లి మోహనరావు, కొమ్ము రవి, మునిపల్లి వెంకయ్య, మునిపల్లి స్నేహబాబు, తోడేటి సిద్ధూ, నంది పాల ఏసుపాదం, తోడేటి అనిల్, ఈపూరు ప్రేమ కుమార్, ఈపూరు శివా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు జాబ్ మేళా

**వేమూరు:** శుక్రవారం జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్ బుధవారం తెలిపారు. వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నామన్నారు. వివరాలకు 80088 63095 నంబరును సంప్రదించాలన్నారు.

## వడ్రంగి అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం

**భట్టిప్రోలు:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్స్ వడ్రంగి అసోసియేషన్ 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్పెంటర్స్ విధిగా సభ్యత్వం, నమోదు, రెన్యువల్ చేసుకోవాలని ప్రముఖ కవయిత్రి దొంతు ప్రభావతి, భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారిలు కోరారు. ఈ సందర్భంగా బుధవారం వేమూరు కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోడూరు వెంకటేశ్వరరావుకు గుర్తింపు కార్డులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ వెబ్‌సైట్ ద్వారా సెల్‌ఫోన్‌లోనే ప్రతి కార్పెంటర్ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఎంపీపీ కార్పెంటర్స్‌కు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్‌వీ రమణ, కార్యాలయ సూపరింటెండెంట్ జలజ, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుర్రం వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు ఏఎస్‌వీ సుబ్బారావు, ఎన్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావుకు సభ్యత్వ నమోదును అందిస్తున్న అధికారులు

## ప్రత్యేక అవసరాల చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

**సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ జ్యోత్స్న**

**రేపల్లె:** ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మట్టా జ్యోత్స్న తెలిపారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అలెంకో సంస్థ వారితో పట్టణంలోని భవిత కేంద్రంలో బుధవారం నిర్వహించిన మెడికల్ అసిస్మెంట్ క్యాంప్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి అలెంకో సంస్థ ద్వారా ఉపకరణాలను అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దివ్యాంగులు తాము వైకల్యం చెందిన వారిమన్న భావనను మనస్సులోకి రానివ్వరాదన్నారు. వైకల్యాన్ని జయించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు అనేక మంది ఉన్నారని.. వారిని ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. భవిత కేంద్రాలలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు స్పెషల్ ఎడ్యుకేటర్‌ల ద్వారా ప్రత్యేక తర్ఫీదునిస్తూ మెరుగైన ఫలితాలను రాబడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అలెంకె సంస్థ ప్రతినిధులు రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల నుంచి వచ్చిన 200ల మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ మేకా శివరామకృష్ణ, సహిత విద్య ఉపాధ్యాయులు అనురాధ, సుకన్య, విజయ్‌కుమార్, రవీంద్ర, కల్పన, మహాలక్ష్మి, సురేష్, యెహాన్, రవిశేఖర్, నాగార్జున, జాన్సన్, అలెంకో సంస్థ ప్రతినిధులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

